సాక్షి జగిత్యాల

బుధవారం । 13 । మార్చి । 2024



బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

ధర్మపురి నృసింహుడి సన్నిధిలో నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో అన్ని శాఖల అధికారులు నిమగ్నమయ్యారు. - 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ : 6:24	గురు 4:56

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/21.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

దుబ్బ రాజన్న హుండీ ఆదాయం రూ. 29.90 లక్షలు



దుబ్బరాజన్న ఆలయ ఆవరణలో డబ్బులు లెక్కిస్తున్న భక్తులు

సారంగాపూర్: దుబ్బరాజన్నకు బ్రహ్మోత్సవాల ద్వారా రూ.29,90,765 ఆదాయం సమకూరింది. మహాశివరాత్రి సందర్భంగా భక్తుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. వివిధ సేవా టికెట్ల ద్వారా రూ.25,57,804, మిశ్రమ బంగారం 17.500 గ్రాములు, మిశ్రమ వెండి 5.250 కిలోలు, కోడెల ద్వారా ఆదాయం రూ.1,26,000 వచ్చింది. లెక్కింపులో ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ కమిషనర్ చంద్రశేఖర్, ఈవో అనూష, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ శంకరయ్య, ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నాగాలయ హుండీ ఆదాయం రూ.2.72 లక్షలు



హుండీ లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

రాయికల్: మండలంలోని కొత్తపేటలోని రాజరాజేశ్వర నాగాలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.2,72,968 వచ్చినట్లు ఈవో విక్రమ్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రవికిషన్, అర్చకులు రాజేశ్వరశర్మ, ఉత్సవ కమిటీ చైర్మన్ దానవేని రాము, ఏఎస్సై దేవేందర్ పాల్గొన్నారు.

రంజాన్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

జగిత్యాలక్రైం: రంజాన్‌ను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, ఇందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్‌ను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునేందుకు మత పెద్దలంతా సహకరించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వేణుగోపాల్ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న కేసీఆర్, వినోద్‌కుమార్





కరీంనగర్ కదనభేరి సభలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వేదికపై పోచారం శ్రీనివాస్, మహమూద్ అలీ, వినోద్ కుమార్, కడియం శ్రీహరి, కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మధుసూదనాచారి, రసమయి బాలకిషన్, సతీశ్‌బాబు, రవిశంకర్, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు

రైతులను చూస్తే.. కన్నీళ్లు ఆగట్లే..

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఎకరమైనా ఎండిందా?



సభకు హాజరైన ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు



- చెరువుల్లో మత్తళ్లు దూకిన నీరు మాయమెలా?
- స్మార్ట్‌సిటీ, రైల్వే, రహదారులు తెచ్చిన సమర్థుడు వినోద్
- బండికి, వినోద్‌కు నక్కకు నాగలోకానికి ఉన్నంత వ్యత్యాసం
- తెలంగాణ గళం కోసం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలి
- సిరిసిల్ల ఆత్మహత్యలు ఆపేందుకే బతుకమ్మ చీరలు
- కదనభేరి సభలో కాంగ్రెస్, బీజేపీలపై మాజీ సీఎం కేసీఆర్ నిప్పులు

కరీంనగర్‌కు బండి చేసిందేంటి?: వినోద్



తాను ఎంపీగా ఉన్నప్పుడు రూ.1000 కోట్లతో స్మార్ట్ సిటీ, జాతీయరోడ్లు, కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్, కేబుల్ బ్రిడ్జి, ఐటీ టవర్ తదితర ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు కేంద్రంతో పోరాడి తీసుకువచ్చామని మాజీ ఎంపీ వినోద్ అన్నారు. ఎంపీగా ఐదేళ్లలో బండి సంజయ్ ఏంచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాకు ఒక నవోదయ ఉండాలని, మన రాష్ట్రంలో బండి సంజయ్ ఒక్క నవోదయ కూడా తేలేకపోయాడని విమర్శించారు. తాను లోక్‌సభలో మొత్తం 106 సార్లు రాష్ట్ర, కరీంనగర్ ప్రయోజనాలపై గళమెత్తానని, బండి సంజయ్ పార్లమెంటులో ఎన్నిసార్లు మాట్లాడారని ప్రశ్నించారు. మొన్న అసెంబ్లీలో ఓడిన వ్యక్తికి పార్లమెంటులో ఏం పని అని? ఇదేమైనా పునరావాస కేంద్రమా? అని నిలదీశారు. సీఎంగా కేసీఆర్ గెలిచి ఉంటే మేడిగడ్డలో దగ్గరుండి మరమ్మతులు చేయించేవారన్నారు.

కేసీఆర్ రాకతో నేల పులకరించింది: గంగుల



కేసీఆర్ కరీంనగర్‌లో అడుగుపెట్టగానే ఈ నేల పులకించిపోయిందని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. 2001లో తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా టీఆర్‌ఎస్ పార్టీని స్థాపించినప్పుడు కేసీఆర్ కరీంనగర్ గడ్డ నుంచే సింహగర్జన చేశారని, ఆ తర్వాత విజయవంతంగా లక్ష్యాన్ని సాధించారని గంగుల గుర్తుచేశారు. ఉద్యమంలో ఆమరణ దీక్ష నుంచి రైతుబంధు, దళితబంధులాంటి పథకాలకు కరీంనగర్ నేలమీద నుంచే కేసీఆర్ శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల కోసం ఈ కరీంనగర్ గడ్డ నుంచే కదనభేరి మోగించేందుకు కేసీఆర్ వచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.



కేసీఆర్‌కు గద బహూకరిస్తున్న వీర్ల వెంకటేశ్వర్లు



గంగుల నివాసంలో మాటామంతీ

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

తాను సీఎంగా ఉన్నప్పుడు ఎకరమైనా ఎండలేదని, మూడునెలల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు పంటలకు నిప్పు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల కోసం కరీంనగర్ కదనభేరి పేరిట నగరంలోని ఎస్సారార్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన భారీబహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరై కాంగ్రెస్, బీజేపీపై నిప్పులు చెరిగారు. కరీంనగర్ చాలా చైతన్యమున్న గడ్డ అని.. అందుకే తాను పదవులను విసిరికొట్టి ఇదే నేలనుంచి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం చేపట్టినట్లు గుర్తుచేశారు. కరీంనగర్ చైతన్యవంతమైన జిల్లా, పోరాటాల పురిటిగడ్డ అన్నారు. 2001, మే17న ఇదే ఎస్ఆర్ఆర్ కళాశాల వేదికగా 'సింహ గర్జన' పేరిట నిర్వహిస్తే కరీంనగర్ జనాలు తెలంగాణ జెండాను ఆకాశానికి ఎత్తుకున్నారని గుర్తుచేశారు.మాట ఇచ్చి తప్పడం కాంగ్రెస్‌కు అలవాటేనని, నాడు తమ పొత్తుతో గెలిచావని ఎగతాలి చేస్తే.. రాజీనామా చేసి రెండున్నర లక్షలఓట్ల మెజారిటీతో తాను కరీంనగర్ ఎంపీగా తిరిగి గెలిచానన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే.. దానికి మరమ్మతులు చేయకుండా వదిలేయడమేంటని ప్రశ్నించారు. తాను సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో ఎకరమైనా ఎండలేదని, ఇప్పుడు కరెంటు, నీళ్లు ఎలా మాయమయ్యాయని ప్రశ్నించారు. కాళేశ్వరం కట్టి ఎల్ఎండీ, ఎంఎండీలు నింపితే ఎండాకాలం చెరువులు మత్తళ్లు దూకాయన్నారు. 420 పథకాలు ప్రకటించి ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. మూడు నెలలకే వాటిని నెరవేర్చలేక తనను తిట్టడం పనిగా పెట్టుకుందని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో సిరిసిల్ల చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఆపేందుకు తాను రూ.50 లక్షలు సేకరించి ఇచ్చానని, వారికి తిరిగి ఉపాధి కల్పించేందుకే బతుకమ్మ చీరలు, పిల్లలకు యూనిఫాంల ఆర్డర్స్ ఇచ్చామని వివరించారు. ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు పెడుతున్న బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ఇబ్బందులు పెట్టడమేంటని, తాము అధికారంలో ఉన్నప్పుడు అలాచేసి ఉంటే కాంగ్రెస్ వాళ్లు మిగిలేవాళ్లు కాదన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎవరూ మనస్ఫూర్తిగా జై తెలంగాణ అనలేరని, తెలంగాణ దళం, తెలంగాణ బలం బీఆర్ఎస్సేనని అన్నారు. కరీంనగర్ సహా అన్ని పార్లమెంటు స్థానాల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

బండి రూ.10 పనైనా చేసిండా?

కరీంనగర్ ఎంపీగా ఐదేళ్లు ఉన్న సమయంలో కరీంనగర్‌ను హైదరాబాద్‌తో కలిపే కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్, కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ హోదా, జాతీయ రహదారులు, ఇతర ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు తెచ్చిన సమర్థుడు వినోద్ అని ప్రశంసించారు. ఐదేళ్ల కాలంలో బండి సంజయ్ రూ.పది పని అయినా చేసిండా? అని ప్రశ్నించారు. ఇప్పటికే మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోయి గోస పడుతున్నారని, మరోసారి అలా అవొద్దని హెచ్చరించారు. ఇలాంటి సమయంలో ఢిల్లీలో, పార్లమెంటులో తెలంగాణ గొంతుక వినబడాలంటే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచేలా బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.



సభలో రసమయి బాలకిషన్ ఆటాపాట

'గృహజ్యోతి' పరేషాన్

- 'జిల్లాకేంద్రంలోని ఒకటో వార్డుకు చెందిన రాధ, విజయ, స్వాతి ఆరుగ్యారంటీల పథకాలకు దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు వారికి రశీదులు కూడా ఇచ్చారు. అయినా వారి వివరాలు వెబ్‌సైట్‌లో లేవు. ఇంకా దరఖాస్తు చేసుకోనట్లే ఉంది..'

- 'జిల్లాకేంద్రంలోని రెండో వార్డుకుచెందిన అడప వసంతకు తెల్లరేషన్‌కార్డు ఉంది. విద్యుత్ బిల్లు మాఫీ కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుంది. ఆమె మీటరు నంబర్ అదే కాలనీకి చెందిన అరెగంటి లక్ష్మీ పేరిట నమోదై జీరో బిల్లు వచ్చినా.. వసంతకు వర్తించలేదు. ఆమె మున్సిపల్ కార్యాలయానికి రాగా నంబరు తప్పు పడిందని తిప్పి పంపించారు. ఎడిట్ ఆప్షన్ లేకపోవడం, తప్పులు సరిచేయలేకపోవడంతో అనేకమంది వెనుదిరుగుతున్నారు..'

- అంతా అయోమయం
- సవరణకు తిప్పలు
- ఎంట్రీకాని 'ప్రజాపాలన' దరఖాస్తులు
- కనిపించని ఎడిట్ ఆప్షన్
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- 40 శాతం మీటర్ల దరఖాస్తులు రిజెక్ట్

జగిత్యాల/కోరుట్ల: 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడుకునే వారికి ప్రభుత్వం ఇచ్చిన మినహాయింపు ఇక్కట్లకు గురిచేస్తోంది. నెల క్రితం విద్యుత్ శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి గృహజ్యోతి పథకం అమలుకు విద్యుత్ మీటర్ల వివరాలను ఆన్‌లైన్ చేశారు. దీనికి ప్రజాపాలన దరఖా స్తు నంబర్లు కూడా జత చేశారు. అయినా జీరోబిల్లు రాకపోవడం.. ఇతరులకు రావడంతో ఆందోళన చెందుతున్నారు.



జగిత్యాలలో ప్రజాపాలన కౌంటర్ వద్ద ప్రజలు

కారణాలు అనేకం..

అర్హులైన చాలామందికి జీరో బిల్లు రాకపోవడానికి లెక్కలేనన్ని కారణాలు ఉన్నట్లు సమాచారం. మీటర్లను ఆన్‌లైన్ చేసే క్రమంలో కొంతమంది ప్రజాపాలన దరఖాస్తు నంబర్లు సరిగా ఇవ్వకపోవడం.. గృహజ్యోతికి సంబంధించిన కాలమ్‌లో టిక్‌మార్క్ చేయకపోవడం, కరెంటు బిల్లుకు సంబంధించిన యూనివర్సల్ సర్వీస్ కోడ్ సరిగా నమోదు చేయకపోవడం.. ఒక ఇంట్లో ఒకే వ్యక్తి, ఒకే రేషన్‌కార్డుపై ఎక్కువ మీటర్లు ఉన్న సందర్భంలో దరఖాస్తులు తిరస్కృతికి గురయినట్లు విద్యుత్ శాఖ సిబ్బంది చెబుతున్నారు. ఇలా అర్హులకు జీరో బిల్లు రాకపోవడానికి లెక్కలేని కారణాలు ఉన్నాయి.

రిజెక్ట్ మీటర్లు 40 శాతం

జిల్లాలోని మెట్‌పల్లి సబ్ డివిజన్ పరిధిలో మెట్‌పల్లి, మెట్‌పల్లిరూరల్, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లో మొత్తం 55,068 విద్యుత్ మీటర్ల వినియోగదారులు జీరోబిల్లుకు దరఖాస్తు చేసుకోగా.. 31,493 మందికి మాత్రమే జీరోబిల్లు వచ్చింది. కోరుట్ల సబ్ డివిజన్‌లోని కోరుట్ల, కోరుట్ల రూరల్, కథలాపూర్, మేడిపల్లి మండలాల్లో మొత్తం 64,301 విద్యుత్ మీటర్ల వినియోగదారులకు 33,954 మందికి మాత్రమే జీరో బిల్లు వచ్చింది. ఈ లెక్కన రెండు సబ్ డివిజన్లలోనూ కేవలం 58 నుంచి 60 శాతం విద్యుత్ వినియోగదారులకు మాత్రమే జీరో బిల్లు వచ్చింది. జగిత్యాల, మల్యాల విద్యుత్ సబ్ డివిజన్లలోనూ ఇదే పరిస్థితి. మొత్తం మీద జిల్లాలో 40 శాతం మేర దరఖాస్తుదారులకు గృహజ్యోతి పథకం కింది జీరో బిల్లులు రాకపోవడం గమనార్హం.

సవరణకు తిప్పలే..

జీరో బిల్లు కోసం దరఖాస్తు చేసుకున్నా పలు కారణాలతో తిరస్కృతికి గురైన వారు మళ్లీ సవరణకు మున్సిపల్, మండల పరిషత్, ఆర్డీవో కార్యాలయాల్లో అవకాశం కల్పించారు. ఆయా కార్యాలయాల్లో ఒకే లాగిన్ ఇవ్వడంతో జీరో బిల్లు అమలు కోసం వస్తున్న పొద్దస్తమానం వందలాది మంది వినియోగదారులు క్యూ కడుతున్నారు. కొన్ని కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి సరైన అవగాహన లేకపోవడం సమస్యగా మారింది. ఒక్కో మున్సిపల్ లేదా మండల కేంద్రాల్లో కేవలం ఒకటి రెండు సవరణ కేంద్రాలు మాత్రమే ఉండటం వినియోగదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. సవరణ చేసిన అనంతరం దరఖాస్తుదారునికి ఓటీపీ రావడం.. ఆ ఓటీపి ఎంట్రీ చేసిన తరువాత విద్యుత్ ఎనర్జీ బిల్లింగ్ సిస్టంలో సదరు మీటరు వివరాలు నమోదయ్యాకే జీరో బిల్లు వస్తోంది. ఈ విషయంలో సవరణ కేంద్రాల వద్ద ఎవరికీ సరైన అవగాహన లేకపోవడం, విద్యుత్ అధికారులు తమ పరిధిలో ఏమీలేదని చెప్పడం సమస్యగా మారింది. దీంతో దరఖాస్తుదారులు అయోమయ పరిస్థితుల్లో గందరగోళానికి గురవుతున్నారు. ఈ పరిస్థితిని తొలగించడానికి సవరణ కేంద్రాలు గ్రామగ్రామాన ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.

రెండు రోజుల నుంచి తిరుగుతున్న



మా మీటర్ 200 యూనిట్ల లోపే తిరుగుతుంది. మాకు జీరో బిల్లు రాలేదు. మళ్లీ సవరణ చేయించుకోవడానికి మండల ఆఫీస్‌కు రెండు రోజుల నుంచి తిరుగుతున్న. ఇప్పుడయిందని అంటున్నారు. బిల్లు వచ్చేదాకా ఏ విషయం తెల్వదు.

– జమున, అయిలాపూర్, కోరుట్ల

ఆందోళన చెందవద్దు

ప్రజాపాలన వెబ్‌సైట్‌లో వివరాలు లేకున్నా సరిదిద్దుతాం. సాంకేతిక సమస్యలతో వివరాలు చూపడం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం. కొత్తగా దరఖాస్తులు కూడా స్వీకరిస్తున్నాం.

– అనిల్‌బాబు, జగిత్యాల మున్సిపల్ కమిషనర్

ఇలా చదివితే విజయం మీదే..

- ఎస్సెస్సీ పరీక్షలకు ఆరు రోజులే
- సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు
- సూచనలిస్తున్న ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు

గొల్లపల్లి: ఇన్నాళ్లు వారివారి పాఠశాలలోనే వార్షిక పరీక్షలు రాశారు. పదో తరగతికి చేరి తొలిసారి బోర్డు పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల్లో కాస్త ఒత్తిడి, భయం ఉండటం సహజం. అయితే పరీక్షలు సమీపిస్తున్న వేళ ఎలాంటి ఒత్తిడికీ గురికాకుండా ప్రణాళికాబద్ధంగా చదివితేనే మంచి మార్కులు వస్తాయంటున్నారు ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు. పదో తరగతి



చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

బోర్డు పరీక్షలు ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇక మిగిలింది ఆరు రోజుల సమయమే. ఇప్పటివరకు చదివింది ఒక ఎత్తయితే.. ఈ ఆరు రోజుల్లో చదవడాన్ని కీలకంగా భావించాల్సి ఉంటుందంటున్నారు. ఆంగ్లం, గణితం, సైన్స్, సోషల్, సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించాలంటే పక్కా ప్రణాళిక అవసరమంటున్నారు. ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు ఇచ్చిన సలహాలు, సూచనలు...

ఒత్తిడిని జయించాలి

బోర్డు పరీక్షలకు హాజరుకావడం తొలిసారి అయినందున విద్యార్థులు ఆందోళనకు గురవుతుంటారు. ఇవి కూడా పాఠశాలల్లో రాసిన పరీక్షలుగా భావించి ఒత్తిడిని దూరం చేసుకోవాలి. పరీక్షల్లో విజయం తమదేనని నమ్మకంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చేస్తున్న సూచనలను పాటిస్తూ ముందుకు సాగితే మంచి జీపీఏ సాధించడం సులభమే. ప్రశాంత వాతావరణంలో ఉదయం 5 గంటలకే లేచి చదివితే మంచిది. అలాగే సబ్జెక్టుల్లోని కీలక అంశాలను ఎప్పటికప్పుడు నోట్స్‌గా రాస్తే పాయింట్ల వారీగా పరీక్షల్లో రాసేందుకు అవకాశముంటుంది. కఠినమైనదని భావిస్తూ ప్రతిరోజూ ఒకే సబ్జెక్టు కాకుండా మార్చిమార్చి చదివితే అన్ని సబ్జెక్టులను కవర్ చేయడం సాధ్యమవుతుంది.

ప్రశ్నపత్రం క్షుణ్ణంగా చదవాలి



విద్యార్థులు తొలుత ప్రశ్నపత్రాన్ని క్షుణ్ణంగా చదవాలి. ప్రతి లెక్కలో కనుగొనాల్సిన అంశాలు, దాని సూత్రాలను ఎంచుకుంటూ పరీక్ష రాయడం ప్రారంభించాలి. తద్వారా ప్రతి ప్రశ్నకు కనీస మార్కులు సాధించొచ్చు. మొత్తం 80మార్కుల ప్రశ్నపత్రంలో పార్ట్-ఏకు 60 మార్కులు, పార్ట్ బీకి 20 మార్కులు ఉంటాయి. ఇందులో 50శాతం ప్రశ్నలు సులభంగా, 30 శాతం ప్రశ్నలు మధ్యస్తంగా, 20 శాతం ప్రశ్నలు ఆలోచనాత్మకంగా ఉంటాయి. వీటిలో ప్రతి ప్రశ్నను శ్రద్ధగా చదివి అర్థం చేసుంటే సులభంగా పరీక్ష రాయొచ్చు.

శ్రీనివాస్, గణితం ఉపాధ్యాయుడు, యశ్వంతరావుపేట హైస్కూల్

ఏకాగ్రత అవసరం



ప్రతి విద్యార్థి సైన్స్ సబ్జెక్టు విషయమై పాఠ్య పుస్తకం తోపాటు అభ్యాస దీపికపై పట్టు సాధించాలి. సైన్స్‌లో బొమ్మలు చక్కగా గీసి, భాగాలను గుర్తించడాన్ని ప్రాక్టీస్ చేయాలి. మూలకాల ఆవర్తన పట్టికను చక్కగా అవగాహన చేసుకోవాలి. ప్రతిరోజూ సమయపాలన పాటిస్తూ అర్థవంతంగా చదువుకోవాలి. పూర్తి సమాచారంతో జవాబులు రాయడంపై శ్రద్ధ వహించాలి. అన్ని పాఠ్యాంశాలను చదవుతూనే అతి ముఖ్యమైన అంశాలపై మరింత ఏకాగ్రత కనబర్చాలి. మొదటి ఆరు పాఠ్యాంశాలపై పట్టు సాధిస్తే మంచిది.

– రవీందర్, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు, తాట్లవాయి జెడ్పీహెచ్ఎస్

ప్రణాళిక ముఖ్యం



విద్యార్థులకు పరీక్షల సమయంలో ప్రణాళిక ముఖ్యం. ప్రతి సబ్జెక్టుకూ కొంత చొప్పున సమయం కేటాయించాలి. ఆ సమయంలో ప్రణాళికాబద్ధంగా సబ్జెక్టుల్లోని కీలక అంశాలను క్షుణ్ణంగా చదవాలి. సోషల్ సబ్జెక్టు విషయానికి వస్తే మ్యాప్ పేయింటింగ్, మ్యాప్‌లో వివిధ విభాగాలను గుర్తించడం కీలకంగా ఉంటుంది. ఈ విషయంలో ఒకటికి రెండుసార్లు ప్రాక్టీస్ చేయడమేకాకుండా తరచూ మననం చేసుకోవాలి. పరీక్షల్లో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసేలా ప్రయత్నం చేయడం ద్వారా మంచి మార్కులు సాధించొచ్చు.

మహేశ్, సోషల్ ఉపాధ్యాయుడు, రాఘవపట్నం జెడ్పీహెచ్ఎస్

ప్రశ్నలపై అవగాహన అవసరం



విద్యార్థులు ప్రశ్నపత్రాలపై అవగాహన కలిగి ఉండాలి. పార్ట్-ఏ, పార్ట్-బీలో ఏమేం ప్రశ్నలు వస్తాయి..? వాటికి ఎన్ని మార్కులు ఉంటాయో తెలుసుకోవాలి. పేరాగ్రాఫ్‌లు ఇచ్చి ప్రశ్నలు అడిగితే ఒకటికి రెండు సార్లు చదివి అర్థం చేసుకున్నాకే సమాధానం రాయాలి. చదివిన అంశాన్ని అర్థం చేసుకుంటే సులభంగా పరీక్ష రాయొచ్చు. కొన్ని ప్రశ్నల్లో చార్టు ఆధారంగా జవాబులు రాయాల్సి ఉంటుంది. ఇంగ్లిష్‌లో గ్రామర్ అత్యంతా కీలకం. సమాధానాలు రాసే సమయంలో తప్పులు లేకుండా చూసుకోవాలి.

– హరికృష్ణ, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు, మల్లన్నపేట హైస్కూల్

క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

- 31 అంశాలు ఏకగ్రీవ తీర్మానం
- మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు



రాయికల్: పట్టణంలో వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన మున్సిపల్ సాధారణ సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో తాగునీటి సమస్య, పారిశుధ్య నిర్వహణ, హరితహారంలో మొక్కల సంరక్షణపై చర్చించారు. మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని కౌన్సిలర్లు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. రంజాన్ మాసం సందర్భంగా ప్రార్థనమందిరాల వద్ద లైటింగ్, శానిటేషన్ పనులతోపాటు 31 అంశాలను ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమాదేవి, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, కౌన్సిలర్లు మహేందర్, సాయికుమార్, శ్రీధర్ రెడ్డి, మహేశ్‌గౌడ్, అన్వరిబేగం, కల్లెడ సునీత, కో–ఆప్షన్ సభ్యులు మహేందర్‌బాబు, మొరాజోద్దీన్ పాల్గొన్నారు.

బైపాస్ నిర్మాణానికి రైతులు సహకరించాలి



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాలరూరల్: జాతీయ రహదారి–63కి అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న బైపాస్‌రోడ్ నిర్మాణానికి భూములు కోల్పోతున్న అన్ని గ్రామాల రైతులు సహకరించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా కోరారు. మంగళవారం సాయంత్రం జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట, గోపాల్‌రావుపేట రైతులతో తిప్పన్నపేటలో సమావేశం అయ్యారు. ప్రజా అవసరాల కోసం ప్రభుత్వం జాతీయ రహదారి నిర్మిస్తోందని, భూసేకరణ పూర్తయిందని, ఈ దశలో రైతులు అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం ఇచ్చే పరిహారంలో అండగా ఉంటామన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనా చెందవద్దని కోరారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వం పరిహారం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డీఐ విఠల్ పాల్గొన్నారు.

నృసింహుని బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు





ధర్మపురిలో ఏర్పాటు చేస్తున్న స్వాగత తోరణాలు, పార్కింగ్, స్వామివారి కల్యాణం, కోనేరులో ఏర్పాట్లపై పరిశీలిస్తున్న ఈవో, సీఐ, మున్సిపల్ కమిషనర్

- ఈనెల 20 నుంచి వచ్చేనెల ఒకటో తేదీ వరకు..
- ధర్మపురిలో కొనసాగుతున్న పనులు

ధర్మపురి: ధర్మపురి నృసింహుడి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈనెల 20నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలకు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలతోపాటు నిజామాబాద్, నిర్మల్, ఆర్మూర్ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. వారికి సరిపడా కల్పించాల్సిన వసతులపై ఆలయ అధికారులు శాఖల వారీగా ప్రణాళిక రూపొందించుకున్నారు.

అధికారుల పక్కా ప్రణాళిక

బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలు, రాజగోపురాలు, బ్రహ్మపుష్కరిణి వద్ద, గోదావరిలో చలువ పందిళ్లు, స్త్రీలు బట్టలు మార్చుకునేందుకు తడకలతో డ్రెస్సింగ్ రూంలు, షెడ్లు, తాగునీటి వసతి కల్పిస్తున్నారు. ముఖ్యంగా వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే భక్తుల కోసం పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు ముద్రించి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- ఆలయాలు, రాజగోపురాలు, స్వాగత తోరణాలకు రంగురంగుల విద్యుదీపాలంకరణకు చర్యలు తీసుకుంటున్నారు.
- బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో పాతనీటిని తొలగించి కొత్త నీటిని నింపుతున్నారు.
- కోనేరులోని చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు.
- భక్తులకు ఆలయం తరపున, స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో ఆలయంతోపాటు గోదావరి తీర ప్రాంతాల్లో చలివేంద్రాలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నారు.
- అన్నదానం కోసం రైసుమిల్లర్లు, ఆర్యవైశ్యులు, వర్తక సంఘం, ఇతర దాతల సహకారం తీసుకుంటున్నారు.
- జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సుమారు 400 మంది పోలీస్ బందోబస్తుకు చర్యలు చేపడుతున్నారు.
- వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను పరిశీలిస్తున్నారు.
- స్వామివారి కల్యాణానికి ఆలయంలో స్థలం ఇరుకుగా ఉన్నందున మరోచోట చేయించడానికి చర్యలు చేపడుతున్నారు.
- భక్తుల భద్రత నిమిత్తం ఆలయం, గోదావరి తీరప్రాంతం, బస్టాండ్ ఏరియా, ప్రధాన కూడళ్లలో దేవస్థానం, పోలీస్ సంయుక్త పర్యవేక్షణలో 60వరకు సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తున్నారు.

ప్రజాసేవకుడిగా పనిచేస్తా

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



నందగిరి సహకార సంఘం భవనం ప్రారంభిస్తున్న లక్ష్మణ్‌కుమార్, కొండూరి రవీందర్‌రావు

పెగడపల్లి: ప్రజలు మార్పు కోరుకుని తనను ఆదరించి గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని నందగిరిలో సుమారు రూ.50 లక్షలతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనాన్ని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. సహకార సంఘాలను బలోపేతం చేయడంతోపాటు వాటి ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను విస్తృత పరిచేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. సహకార సంఘాలు, ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడుతామని పేర్కొన్నారు. కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సహకార సంఘాల పనితీరు రాష్ట్రానికే పేరు తెస్తున్నాయన్నారు. సంఘాల ద్వారా రైతులకు పంట రుణాలు, విదేశాల్లో ఉన్నత విద్య, మహిళా సంఘాల సభ్యులు, వాహనాల కొనుగోలుకు రుణాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. విండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీపీ శోభ, డీసీవో సత్యనారాయణ, వైస్ ఎంపీపీ గంగాధర్, పెగడపల్లి, నంచర్ల విండో చైర్మన్లు రమణారావు, వేణు గోపాల్, వైస్ చైర్మన్ కిషన్‌రెడ్డి, విండో మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సీఈవో రవీందర్‌రెడ్డి, సంఘం పరిధిలోని ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు రైతులు పాల్గొన్నారు. అనంతరం అయితిపల్లిలో మంచినీటి బావి, కేజీబీవి సమీపంలోని పెగడపల్లి నుంచి మద్దులపల్లికి బీటీ రోడ్డు, మద్దులపల్లిలో బ్రిడ్జి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య



రాజవ్వ మృతదేహం

గొల్లపల్లి: మండలంలోని వెన్గుమట్లకు చెందిన జంగిలి రాజవ్వ(90) చేద బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. రాజవ్వ 10ఏళ్లుగా బీపీ, షుగర్‌తో బాధపడుతోంది. మందులు వాడుతున్నా తగ్గలేదు. జీవితంపై విరక్తి చెందిన చేద బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. రాజవ్వ కొడుకు జంగిలి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడు మృతి



నరేశ్ మృతదేహం

ఇబ్రహీంపట్నం: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందినట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌కు చెందిన రాజారపు నరేష్(32) మంగళవారం వేములకుర్తిలో ఓ శుభకార్యానికి వచ్చాడు. స్వగ్రామానికి వెళ్తుండగా వేములకుర్తి శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే.. ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమతి లేని మెడికల్ షాపు సీజ్



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

మెట్‌పల్లి: పట్టణంలో అక్రమంగా నిర్వహిస్తున్న లైఫ్‌లైన్ మెడికల్ షాపును మంగళవారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ సీజ్ చేశారు. 2018 నుంచి నిర్వహిస్తున్న ఈ మెడికల్ షాపునకు సంబంధించి లైసెన్స్‌ను ఈ ఏడాది రెన్యూవల్ చేసుకోలేదు. సమాచారం అందుకున్న ఆయన తనిఖీలు జరిపి షాపును సీజ్ చేశారు. అందులో నుంచి స్వాధీనం చేసుకున్న మందులను కోర్టుకు సమర్పిస్తామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మృతునిది ఏపీలోని ప్రకాశం జిల్లా

కథలాపూర్(వేములవాడ): మండలంలోని దుంపేట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన బత్తుల రామకృష్ణ (33) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. రామకృష్ణ కొద్దిరోజులుగా మండలకేంద్రంలో నివాసముంటూ చింతకుంటలో సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. సోమవారం రాత్రి చింతకుంట నుంచి కథలాపూర్‌కు బైక్‌పై వెళ్తుండగా.. దుంపేట శివారులో అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బావమరిది బండారు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

పసుపు @16,531



జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా రైతు పండించిన పసుపు పంటకు నిజామాబాద్ మార్కెట్‌లో మంగళవారం రికార్డు ధర పలికింది. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కొప్పెర జలేందర్ తాను పండించిన 20 క్వింటాళ్ల పసుపును నిజామాబాద్ మార్కెట్‌కు తీసుకెళ్లగా.. క్వింటాల్‌కు రూ.16,351 ధర పెట్టారు. కొన్ని రోజులుగా క్వింటాల్‌కు రూ.13 వేల వరకు ఉండగా.. అది ఏకంగా మరో రూ.3వేలు పెరిగింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొండగట్టులో గదుల టెండర్ పూర్తి



టెండర్‌లో పాల్గొన్న టెండర్‌దారులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయానికి సంబంధించి దిగువ కొండగట్టులోని గదులకు మంగళవారం ఆలయ అధికారులు టెండర్ నిర్వహించారు. 39 గదుల సముదాయానికి గాను రూ.3.11లక్షలకు టెండర్ పూర్తయినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్లు సునీల్, టెండర్ల ఇన్‌చార్జ్ ఉమామహేశ్వర్, అధికారులు రవికిషన్, ధర్మేందర్, టెండర్‌దారులు పాల్గొన్నారు.

జిల్లాలో తొలిసారి వృద్ధురాలి గుండెకు స్టంట్



వృద్ధురాలితో డాక్టర్ నితిన్ కుమార్

జగిత్యాలజోన్: జిల్లాలో తొలిసారి 80 ఏళ్ల వృద్ధురాలి గుండెకు జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రి వైద్యుడు నితిన్‌కుమార్ విజయవంతంగా స్టంట్ వేశారు. బుగ్గారం మండలం మద్దునూర్‌కు చెందిన లచ్చవ్వ గుండె జబ్బుతో ఆసుపత్రికి వచ్చింది. ఆమెను పరీక్షించిన వైద్యుడు స్టంట్ అవసరమని గుర్తించారు. చికిత్స చేసి ఆమె ప్రాణాలు కాపాడారు. గతంలో గుండె జబ్బులు వస్తే హైదరాబాద్ లేదా కరీంనగర్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు కార్డియోలాజిస్ట్ నితిన్‌కుమార్ జగిత్యాలలోనే విజయవంతంగా వృద్ధురాలికి స్టంట్ వేయడం గమనార్హం.

ఉద్యాన పంటలవైపు మొగ్గుచూపాలి

గొల్లపల్లి: ఉద్యాన పంటలు సాగుచేస్తూ రైతులు అధిక లాభాలు పొందాలని ఏడీఏ ప్రియదర్శిని అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్, రైతు శిక్షణ కేంద్రం ద్వారా వివిధ పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఉద్యానవన పంటల సాగులో సైంటిస్టులు, వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకుంటూ పంటల సాగు, దిగుబడి పెంచుకుంటు లాభాల బాటలో కొనసాగాలన్నారు. మండలంలో అన్ని పంటలను సాగు చేసేందుకు అనుకూల వాతావరణం ఉందని, రైతులు ఉద్యాన పంటలు సాగుచేస్తూ ఆర్థికంగా ఎదగాలన్నారు. వరి,మొక్కజొన్న వివిధ పంటల యాజమాన్య మెలుకువలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ రాంచందర్, ఏవో కరుణ, అధికారులు రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ చెల్లించాలి

జగిత్యాల: పదో తరగతి పరీక్షల మూల్యాంకన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని డీఈవోకు టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత సంవత్సరం పదోతరగతి మూల్యాంకణ విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ విడుదల కాలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోగ రమేశ్, గొడుగు రఘుపతి, ఎడ్ల గోవర్దన్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో ఉచిత కోచింగ్

జగిత్యాల: డీఎస్సీలో ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. జగిత్యాల, రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన షెడ్యూల్ కులాల అభ్యర్థులకు ఏప్రిల్ 5 నుంచి జూన్ 14 వరకు ఉచితంగా రెసిడెన్షియల్ కోచింగ్ ఇస్తామని, బీఈడీ ఉత్తీర్ణులై టెట్‌లో అర్హత సాధించిన ఆసక్తి గల వారు ఈనెల 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా, చిత్రంలో అదనపు కలెక్టర్లు

జగిత్యాల: పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల ప్రణాళిక తయారు చేసుకోవాలని, ఓటరు జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ ఏర్పాట్లు, ఈవీఎం యంత్రాలు, సిబ్బందికి శిక్షణ అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని సూచించారు. పోలింగ్‌స్టేషన్‌లో ప్రతిదీ పరిశీలించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ రాగానే కోడ్ నియమావళిని అమలు చేయాలన్నారు. వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన కల్పించామని, దీనిపై ప్రత్యేకంగా ఓటర్లు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పోలింగ్ టర్నౌట్ పెరిగేలా చూడాలని, ఓటు ప్రాముఖ్యత ప్రజలకు చేరేలా అవగాహన కల్పించాలని తెలిపారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించి ప్రణాళిక రూపొందించామని, స్వీప్ కార్యక్రమాలు చేపడుతూ ఓటర్లకు అవగాహన కల్పించామని వివరించారు.

అప్పులబాధతో ఆత్మహత్యాయత్నం..

- చికిత్స పొందుతూ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అనిల్

ఇబ్రహీంపట్నం: ఇద్దరు కూతుళ్లకు పెళ్లి చేశాడు.. ఇందుకు తెలిసినవారి వద్ద అప్పు చేశాడు. ఆ అప్పు తీరకపోవడంతో నిత్యం మదనపడ్డాడు. చివరకు ఆత్మహత్యే శరణ్యమని ఈనెల 9న ఇంట్లోనే ఉరేసుకున్నాడు. బంధువులు గమనించి ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినా.. ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ ఘటన మండలంలోని ఎర్రాపూర్ తండాలో విషాదం నింపింది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. ఎర్రాపూర్‌తండాకు చెందిన మలావత్ అమీన్‌లాల్ (45)కు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. కూతుళ్ల వివాహానికి సుమారు రూ.6లక్షలు అప్పు చేశాడు. ఉన్న రెండెకరాల్లో వ్యవసాయం చేస్తున్న ఆయన అప్పు తీర్చే మార్గం కనిపించకపోవడంతో భార్య ప్రమీలతో చెప్పుకుంటూ నిత్యం మదనపడ్డాడు. ఇంట్లోనే ఉరేసుకున్నాడు. గమనించిన భార్య చుట్టుపక్కల వారి సహాయంతో ముందుగా మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రయత్నించినా లాభం లేకపోయింది. మంగళవారం ఉదయం చనిపోయాడు. అమీన్‌లాల్ భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



ఇంట్లో చిందర వందరగా పడేసిన వస్తువులు

మెట్‌పల్లి: పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన తిమ్మని విజయనిర్మల ఇంట్లో సోమవారం రాత్రి దొంగతనం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. విజయనిర్మల ఇంటికి తాళం వేసి తన కూతురితో కలిసి ఊరికి వెళ్లింది. మంగళవారం ఉదయం వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా.. బీరువాలో వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. పరిశీలించగా.. అందులో దాచి ఉంచిన 20 తులాల వెండి, రెండు గ్రాముల బంగారు ఆభరణాలతోపాటు రూ.40వేల విలువైన ల్యాప్‌టాప్, రూ.24వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారమందించింది. సీఐ నవీన్, ఎస్సై చిరంజీవి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మున్నూరుకాపులు ముందుండాలి



ప్రొసీడింగ్ అందజేస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: మున్నూరుకాపులు అన్నిరంగాల్లో ముందుండాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటలో మున్నూరుకాపు సంక్షేమ సంఘం ఫంక్షన్ హాల్ నిర్మాణానికి రూ.20లక్షలు కేటాయించారు. సొంతంగా మరో రూ.లక్ష చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతన్నకు అండగా నిలవడం అందరి బాధ్యత అన్నారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించకుండా ఓటు అడిగే హక్కు బీజేపీకి లేదన్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు బండారి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు దీటి అంజయ్య, సిరిపురం రాజేశం, నాయకులు రాజన్న, లింగారెడ్డి, శ్రీనివాస్, రమేశ్, ఒడ్నాల రాజశేఖర్,చిట్ల అంజన్న, పుప్పాల అశోక్, గోవిందుల రాజన్న, రాచకొండ రామన్న, కొలగాని మధుసూదన్, చీటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఢిల్లీ కోటపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తా


జగిత్యాలటౌన్: ప్రజల అండతో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా గెలిచి ఢిల్లీ కోటపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం జగిత్యాలలో ఉద్యమకారులు, విశ్రాంత ఉద్యోగులు, బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికలు శాశ్వతం కాదని, ప్రజాసేవే శాశ్వతమని, అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయానని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తనకు అండగా నిలిచేందుకు ఇంత పెద్ద సంఖ్యలో వచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. అందరి సహకారంతో ఎంపీ ఎన్నికల్లో గెలిచి తీరుతానన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ఉద్యమ ఆకాంక్షలు నెరవేరలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తుందని పేర్కొన్నారు. జగిత్యాల బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, మున్సిపల్ మాజీ చైర్మన్లు జీఆర్.దేశాయ్, గిరి నాగభూషణం, తాటిపర్తి విజయలక్ష్మి, నాయకులు ఉన్నారు. ముందుగా విశ్వకర్మ ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయిస్తామన్నారు.

కులసంఘాల అభివృద్ధికి కృషి


రాయికల్: కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అన్నారు. మంగళవారం మండలంలోని భూపతిపూర్‌లో వివిధ కులసంఘాల భవనాలకు ప్రొసీడింగ్ కాపీలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అన్ని కుల సంఘాల బలోపేతానికి నిధులు మంజూరు చేస్తున్నామని గుర్తుచేశారు. మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు నిమ్మల శేఖర్ రెడ్డి, గుర్రం మహేందర్‌గౌడ్, జక్కుల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అధిక ధరలపై అధికారులకు ఫిర్యాదు

ధర్మపురి: ఎమ్మార్పీ కంటే అధిక అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న ఓ బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులపై ఎక్సైజ్ అధికారులకు బాధితుడు మంగళవారం ఫిర్యాదు చేశాడు. మండలంలోని దోనూర్‌కు చెందిన దేవి పోచయ్య ఈనెల 10న ధర్మపురిలోని లక్ష్మీనరసింహ బార్ అండ్ రెస్టారెంట్‌లో తన స్నేహితులతో కలిసి విందు చేసుకున్నారు. బార్‌లో సిట్టింగ్ చేసి మద్యం, వాటర్‌బాటిల్స్, స్వీట్ కార్న్ తీసుకున్నారు. క్వార్టర్‌పై రూ.510 ఎమ్మార్పీ ఉంటే రూ.620 తీసుకున్నారని బార్ సూపర్‌వైజర్‌ను ప్రశ్నించగా.. బార్‌లో ఇలాగే బిల్లులుంటాయని దురుసుగా మాట్లాడడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయంపై ఎక్సైజ్ సీఐ మహేందర్‌రెడ్డిని వివరణ కోరగా బార్ అండ్ రెస్టారెంట్లలో సర్వీస్ కింద ధరలు ఎక్కువగానే ఉంటాయని క్వార్టర్ మద్యంకు రూ.20 నుంచి రూ.30 ఎక్కువ తీసుకోవచ్చని, రూ.110 తీసుకోరాదని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



క్యూలైన్లలో భక్తులు



స్వామికి నమస్కరిస్తున్న భక్తులు

కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి కొండగట్టుకు చేరుకున్న భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎండతీవ్రత అధికంగా ఉండటంతో ఉదయమే వచ్చారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ సూపరింటెండెంట్ సునీల్, అధికారులు లతాదేవి, సంపత్, గుడ్ల శ్రీనివాస్, లక్ష్మీరాజం పర్యవేక్షించారు.